# నాలోని వాడు...

అతను ఒక సినిక్. ఈ సంగతి నా మిత్రులు ఎన్నోసార్లు నాకుచెప్పారు. అతని స్నేహం చేయవద్దని హెచ్చరిక కూడ చేశారు. కాని అతనిని దూరంగా వుంచలేను – అది నా 'బలహీనత'.

క్రిందటాదివారం ఒక మంచిప్లాటు ఆలోచించి, కథ రాద్దామని కూచున్నాను. ఎక్కడనుంచి ఊడిపడ్డాడోగాని వూడి పడ్డాడు. అతనిని చూస్తూనే నాకు నీరసం వేసింది. కథ ఇక సాగదని నిశ్చయించు కున్నాను.

"ఏమిటి రాస్తున్నావు?" అన్నాడు.

"కథ"

"పూర్వం సగంరాసి వదలిన ప్రేమి కుల గాథేనా?"

నేను సమాధానం చెప్పలేదు.

"నేనొకటి అడుగుతాను. కోపం రాదు కదూ?"

"అడుగు. మధ్యలో కోపమెందుకు?"

"ఎందుకు నీవీ రచనలు రాసేది?"

నా గొంతుకీ పచ్చి వెలక్కాయ్యడ్డుపడ్డ ట్టయింది. ఆలాటి ప్రశ్నకు ఎట్లా సమా ధానం చెప్పవలెనో నా కర్థం కాలేదు.

"కొన్నికొన్ని సంఘటనలు నాలో ఒక విధమైన అనుభూతిని కలుగ జేస్తాయి. ఆ అనుభవం నల్గురితోనూ పంచుకోవాలనే భావన నాలో బలంగా కల్గుతుంది. ఆ రియాక్షన్ని కథా రూపంలోగాని, వ్యాసరూపంలో గాని, కాగితంపై పెడతాను. అనగా వాస్తవిక సంఘటనలను యథావిధంగా చిత్రించ డంకాదు – నేను చేసేపని ఈ జీవితాన్ని నేను చూసే కోణంలో నుంచి చూస్తూ, అందులో నాకు కనబడే ఒంపులూ, సొంపులూ వర్ణించటానికి యత్నిస్తాను"

"అందుకనేనా ఒకొకప్పుడు నీ కథలు యదార్థానికి దూరంగా, అందు లోని పాత్రలు నీవు మలచిన బొమ్మ లుగా వుంటుంటాయి?"

అవునన్నట్లు తలూపాను.

అంటే నీ భావావేశాన్ని రచనల రూపంలో బయట పెడుతూంటావుగాని, పాఠకుడినిదృష్టిలో వుంచుకోవన్నమాట. పాఠకుడికి నీ కథలవల్ల ప్రయోజనం?"

కోర్టులో ముద్దాయి నడిగినట్లు, ఈ ప్రశ్న లేమిటని నాకు చికాకు వేసింది, ఐనా నా కోపాన్ని బయటపడనీయలేదు,

"పాఠకుడు ఒక ప్రయోజనాన్ని ఆశించి ఈ రచనలను చదవడు. అతనికి ముఖ్యంగా కావలసింది కాలక్షేపం – తద్వారా వినోదం."

"కేవలం కాలక్షేపంకోసం పాఠకుడు కథలు చదువుతాడని తలిస్తే నీవు రాసే నీతికథ లెందుకు? నాల్గవ తరగతి

పిల్లలమర్రి హనుమంతరావు

వాచక పుస్తకాలలో రాసిన నీతి పాఠాలను మళ్ళామళ్ళా కథలరూపంలో నీవు చెపుతూంటే - పాఠకుడు కాలక్షేపం కోసం చదివి వినోదిస్తాడని నీ భావనా? నీ పాఠాలను చదివి, చదివి తెలుగుదేశం హఠాత్తుగా మంచికి మారుపేరుగా మారిపోతుందని అపోహా? నీ నేతి బీరకాయ నీతు లెందుకు?"

ఈ స్థితికి వచ్చిన తరువాత నేను సమాధానం చెప్పదల్చుకొనలేదు. వాగి, వాగి అతనే వెళ్ళిపోతాడని మౌనంగా కూర్చున్నాను. నా నిశ్శబ్దాన్ని గమనించి మరల తనే మొదలు పెట్టాడు.

ఇన్ని ప్రేమకథలు తెలుగులో ప్రచురితమవుతున్నాయి. 'అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకున్నారు' అని గీటుబడ్డ పాతరికార్డులాగ పాడిందే పాడుతూ, చెవికింద హోరెత్తిస్తూంటే, పాఠకుడు నిజంగానే వినోదిస్తున్నాడని భ్రమిస్తున్నావా? కాక మొగుడు భార్యని అనుమానించి, అవమానిస్తే పాఠకుడికి వినోదం కల్గుతుందా? సీతమ్మ-రాముడు లాటి మంచి మనస్సులకు అష్టకష్టాలు సృష్టించి, వారిని టార్చర్ చేస్తూ సినిమా పంథాలలో నడుస్తున్న కథలను, నవలలను చదివితే పాఠకుడికి వినోదమా?"

"రచయిత చేయగల్గిం దేమీలేదు. పాఠకుడు కోరిన సాహిత్యాన్నే అందజేస్తున్నాడు'' ఊరుకోలేక అన్నాను.

"ఇటువంటి రచనలను పాఠకుడు కోరుకుంటున్నాడా? ఇంతకన్నా అబద్ధము ఇంకొకటి వుండదు. మీ రచయితలందరూ దారి తప్పిన పాంథులు. లోకంలోని జీవితంతో సంబంధం లేకుండా ఊహాసౌధాలలో నివసిస్తున్న ఎస్కేపిస్టులు. నిర్జీవమైన భాషతో నిర్వీర్యమైన భావాలను వెదజల్లుతున్నారు. హిందూ నాగరికత, హిందూ ధర్మము మహోన్నతములైనవని చాటటానికి కంకణం కట్టుకున్నాడొకడు. ఒప్పుకున్నామండీ - మన భూతకాలం చాలా గొప్పదే కాని వేయి సంవత్సరములు వెనక్కి పరిగెత్తి, అక్కడే పాతుకు కూర్చొనలేముగదా - ఇంగ్లీషువాడు సాంస్కృతికంగా మనకు తొడిగిన బానిసత్వపు సంకెళ్ళను వదిలించుకున్న తర్వాత కూడ, మాంధాతల యుగమునాటి సంకెళ్ళను స్వధర్మమనే పేరుతో తొడుక్కోలేముగదా! పాతకాలపు వాసనలతో కాళ్ళకు బంధాలు కట్టుకుని భవిష్యత్తులోకి చూడటానికీ నిరాకరిస్తున్నాడు ఈ రచయిత. మహాప్రస్థానానికి నాంది పలుకుతున్నానని, సినిమాలలో హారం వేసుకుని 'నా కలలో నిదురించే చెలీ' అని పాడుకుంటున్నా డొకడు. సాహిత్యానికి మెరుగులు దిద్దగల సామర్థ్య మున్నవారి స్థితే ఇలావుంటే, నీబోటి సన్నకారు రచయితల గురించి చెప్పేదేముంది?"

"తను నమ్మినసిద్ధాంతాల కనుగుణంగా రచించే స్వేచ్ఛ రచయితకు లేదనా?"

"లేదనను. ఆ రకం స్వేచ్ఛ కావలసిందే. కాని జీవితంలో ఎస్కేపిస్టుగా మారవద్దంటాను. పాఠకుడు కోరుకున్న

రచనలు, అతగాడిని వుత్తేజపరిచే రచనలు చేయటం రచయితయొక్క కనీస ధర్మం. అంటే ఏమిటో నీకు తెలియదు. ఆఫీసు ఫైళ్ళలో మునిగి తేలుతూంటావు. మధ్య మధ్య 'నేనూ రచయిత నను కొంటూ రచనలు కొనసాగిస్తావు. నీవు సృష్టించిన పాత్రలన్నీ ప్రాణం లేని మట్టిముద్దల్లాగ పాఠకుడి ముందు నిలబడతాయి. వాటివలన పాఠకుడికి వినోదమూ లేదు - విజ్ఞానమూ లేదు. పాఠకుడు కోరుకునేది నీకెట్లా తెలుస్తుందని నీ అనుమానం? నీ ఊహా సౌధాలలో నుంచి కిందకు దిగిరా. నిండు భోజనమంటూ ఎరుగని మన సామాన్య ప్రజానీకంతో మానసికంగా కలిసి జీవించు. అప్పుడే అతనికి ఏది ఆహ్లాదం కలిగిస్తుందో - ఏది వినోదం కలిగిస్తుందో - ఏది ఉత్తేజపరుస్తుందో తెలుస్తుంది."

"అంత కృషి చేసి రాసే రచయితలూ వున్నారు."

"వున్నారా? ఏరీ? ఒక్కడూ కనిపించడేం? అటువంటి వాడుంటే, దేశమీస్థితిలోవుండగా మౌనంగాకూర్చోడు. ఇప్పుడు పాకిస్తానీయులు మనతో యుద్ధం చేస్తున్నారు. దేశమంతా ఉత్తేజితమయింది. అంతస్తులూ, మతాలు - అన్నీ మరిచి ప్రతి ఒక్కడూ విరోధి నెదుర్కొనటానికి ముందడుగు వేశాడు. కాని తెలుగు రచయితల జాతి కూడబలుక్కుని, పాతమురికి కలల జీవితంలోనుంచి బయటకు రా నిరాకరించింది. ఈనాడుగూడ ప్రేమకథలతోను, అప్పకవి ఇంటి పేరుగూర్చి హోరాహోరి చర్చలతోను తెలుగు పత్రికలన్నీ నిండిపోతున్నాయి. తెలుగు రచయిత దేశాన్ని ఉత్తేజ పరచలేని అసమర్థుడు. యుద్ధమంటే యేమిటోకూడ తెలియదు. ప్రజలంటే ఎవరో నీ కర్థమవాలంటే, పత్రికా విలేఖరివరె యుద్ధం జరుగుతున్న ప్రాంతాలకు పరిగెత్తుకుని వెళ్ళు. మాతృదేశ రక్షణకోసం పారే ఆ వేడి రక్తాన్ని కళ్ళారా చూడు. పైనుంచి బాంబులు పడుతున్నా లెక్కచేయక సైనికులకు చేయూత నిచ్చే ఆ సరిహద్దు జనుల ధైర్యసాహసాలను చూడు. చావు బ్రతుకుల మధ్యకెళ్ళి నిల్చుని ఆ దృశ్యాలను తిలకించు. అప్పుడు ప్రజలంటే ఎవరో, పాఠకునికి కావలసిం దేమిటో నీకు తెలుస్తుంది - నాకు తెలుసు ఈ పని చేయటానికి కావలసిన మానసిక స్థైర్యము నీకు లేదు. నీ ఆర్థికస్థితిలో నీ ఉద్యోగాన్ని వదిలి బయటకురాలేవు. అందుకే నీ చేతిలో కలాన్ని గిరాటు వెయ్యి. నీవు రాస్తున్న కాగితాలను చించి పారెయ్యి. నీ ఆఫీసు ఫైళ్ళతోనే తృప్తి పడు! రచనల జోలి నీ కొద్దు."

పది నిముషాలు నిశ్శబ్దం.

"నీ ఉద్దేశంలో - ట్రాఫిక్ పోలీసులాగ తన రచనలతో సమాజాన్ని కంట్రోల్ చేయగలిగిన వాడేనా రచయిత?"

అతను నవ్వుతున్నాడు. వెగటుగా - హేళనగా - జాలిగా నవ్వుతున్నాడు. ఆ నవ్వులోనే కరిగిపోయాడు. నాకు ముందరే తెలుసు - అతనొక సినిక్.